

రహదారి చూపుతున్నారు!



రోడ్డు పనులు చేపట్టిన తర్వాత జల్లూరు-సామర్లకోట రోడ్డు ప్రస్తుత పరిస్థితి



వైసీపీ పాలనలో జల్లూరు-సామర్లకోట మధ్య ఆర్‌అండ్‌బీ రహదారి దుస్థితి

- తీరుతున్న ఐదేళ్ల కష్టాలు
- ఎట్టకేలకు పిఠాపురం-సామర్లకోట రోడ్డు పనులు
- ఆంధ్రజ్యోతి కథనం, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవతో మోక్షం
- వైసీపీ హయాంలో కాంట్రాక్టర్‌కు పెట్టిన బకాయిలు చెల్లింపు
- చకచకా సాగుతున్న రహదారి విస్తరణ, పునర్నిర్మాణ పనులు

పిఠాపురం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల పాటు ప్రజలు, వాహనదారులు పడిన కష్టాలు తీరుతున్నాయి. కేంద్రం నిధులు ఇచ్చినా వైసీపీ వాటిని దారిమళ్లించి కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో నిలిచిపోయిన పనులకు ఎట్టకేలకు మోక్షం లభిస్తోంది. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం, ఆపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవతో కాంట్రాక్టర్‌కు బిల్లులబకాయిలు చెల్లించడంతో ప్రస్తుతం చకచకా పనులు జరుగుతున్నాయి. గోతులమయంగా మారినరహదారిపై ప్రత్యక్ష నరకం చూసిన ప్రజలు నేడు జరుగుతున్న పనులతో తమ ప్రయాణం సాఫీగా జరుగుతుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఐదు నియోజకవర్గాలకు దారి

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే ప్రధాన రహదారిగాఉన్న పిఠాపురం-సామర్లకోట మధ్య 13కిలోమీటర్ల పొడవునాగల ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి మీదుగా పిఠాపురం, సామర్లకోట, పెద్దాపురం పట్టణాల ప్రజలతోపాటుపిఠాపురం, పెద్దాపురం, కాకినాడ రూరల్, జగ్గంపేట, ప్రత్తిపాడు నియోజకవర్గాలకు చెందిన 100 గ్రామాలప్రజలు, వాహనదారులు రాకపోకలుసాగిస్తూ ఉంటారు. సామర్లకోట రైల్వేజంక్షన్ కావడం, రాజమహేంద్రవరం లేదా మధురపూడివిమానాశ్రయం వెళ్లేందుకు ఇదే ప్రధానమార్గం. సూరంపాలెం, రాజమహేంద్రవరం ఇంజనీరింగ్, పీజీ కళాశాలలు వెళ్లేందుకు విద్యార్థులు, అందులో పనిచేసే ఉద్యోగులు ఇదే మార్గంలో ప్రయాణం సాగిస్తూ ఉంటారు. పిఠాపురం-సామర్లకోట రోడ్డును ఎఫ్‌కేపాలెంనుంచి సామర్లకోట వరకూ 8.20 కిలోమీటర్ల మేర విస్తరించి అభివృద్ధి చేసేందుకు, అవసరమైనచోట్ల కల్వర్టులు, బ్రిడ్జిల నిర్మాణానికి కేంద్రం భారతమాల ద్వారా రూ.15కోట్లు నిధులు విడుదల చేసింది. ఐదేళ్ల క్రితం నిధులు విడుదల చేయగా 2020,నవంబరులో ఈ పనులకు కేంద్ర మంత్రి గడ్కరీ, అప్పటి సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. ఇక పనులు చకచకా జరిగి తమ కష్టాలు తీరతాయని ప్రజలు ఆశించారు. పనులు అప్పగించిన కాంట్రాక్టర్ ముందుగా కొన్ని కల్వర్టు పనులు, సామర్లకోట శివారు బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టి పూర్తిచేశారు. అప్పటి వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదు. కేంద్రం ఇచ్చిన నిధులను దారి మళ్లించడంతో కాంట్రాక్టర్‌కు చెల్లింపులు నిలిచిపోయాయి. దీనితో పనులను నిలిపివేశారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేసినా అప్రోచ్‌లు నిర్మించలేదు. అధికారులు బతిమాలి తాత్కాలిక అప్రోచ్‌లు ఏర్పాటు చేయించారు.

మహా శివరాత్రికి పూర్తి చేసేలా..

పిఠాపురం పాదగయ క్షేత్రం, సామర్లకోట భీమేశ్వరస్వామి దేవస్థానాలకు మహాశివరాత్రి పర్వదినాల సమయంలో వచ్చే లక్షలాదిమంది భక్తులు ఇబ్బంది పడకుండా ఆలోగా పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు. మహాశివరాత్రి కంటే ముందుగానే పనులు పూర్తి చేసి రోడ్డును పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలకు అనుగుణంగా రోడ్డు విస్తరించి తారు రోడ్డును నిర్మిస్తున్నారు. పనులు పూర్తయిన ప్రాంతాల్లో వాహనదారులు ఐదేళ్ల కష్టాలకు ఇన్నాళ్లకు పరిష్కారం లభించిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి కథనంతో కదలిక

కేంద్రం నిధులు ఇచ్చినా కాంట్రాక్టర్‌కు బిల్లుల బకాయిలు చెల్లించక రోడ్డు అభివృద్ధి పనులు నిలిచిపోవడం, ఐదేళ్ల వైసీపీ పాలనలో మరమ్మతులు నిర్వహించకపోవడంతో పిఠాపురం-సామర్లకోట మధ్యగల రహదారి పూర్తిగా గోతులమయంగా మారి 9కిలోమీటర్లమేర రోడ్డు పూర్తిగా అధ్వాన స్థితికి చేరి పలుచోట్ల భారీ గోతులు ఉండడం, కొన్నిచోట్ల రాళ్లు లెగిసిపోవడంతో ఈ రోడ్డు ప్రయాణం ప్రత్యక్ష నరకాన్ని చూపిస్తూ ప్రతిరోజూ పదికిపైగా ప్రమాదాలు జరిగి వాహనదారులు గాయపడుతున్నారన్న విషయాన్ని వివరిస్తూ ఆంధ్రజ్యోతిలో నరక ప్రయాణం శీర్షికతో వార్తా కథనం ప్రచురితమైంది. దీనిపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆరా తీసి తక్షణం పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని తన పేషీఅధికారులకు సూచించారు. ఆయన ఆదేశాలతో ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులతో మాట్లాడి వైసీపీహయాంలో కాంట్రాక్టర్‌కు పెట్టిన బిల్లుల బకాయిలను రెండువారాల క్రితం చెల్లించారు. మిగిలిన పనులు పూర్తిచేస్తే తక్షణం బిల్లుల చెల్లిస్తామని డిప్యూటీ సీఎం పేషీనుంచి వచ్చిన భరోసాతో కాంట్రాక్టర్ పనులు చేపట్టారు. సామర్లకోట-జల్లూరు వరకూ రోడ్డు విస్తరణ పనులతోపాటు రోడ్డుపునర్నిర్మాణం, ఎఫ్‌కేపాలెం, కందరాడ వరకూ రోడ్డు పనులను చేపట్టారు.

కూరగాయల ధరలు..

తగ్గుముఖం

- టమాటా కిలో రూ.10
- బంగాళాదుంప రూ.30
- క్యాబేజీ, కాలీఫ్లవర్ కిలో రూ.15-20
- చిక్కుళ్లు రూ.26
- వంకాయలు రూ.14-20

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో కూరగాయల ధరలు తగ్గుముఖం పట్టాయి. ఈసీజన్‌లో పండే అన్ని రకాల కూరగాయలు డిమాండ్‌కు మించి మార్కెట్‌కు వస్తుండడంతో ధరలు బాగా తగ్గాయి. ఇది సీజన్ కావడంతో టమాటా భారీగా వస్తోంది. చిత్తూరుజిల్లా మదనపల్లె నుంచి టమాటా దిగుమతి అవుతుంది. స్థానికంగా రైతులు వేసిన పంట ఎక్కువగా రావడంతో దిగుమతులు నిలిపివేశారు. నెలక్రితం కిలో రూ.30 చొప్పున అమ్ముడైన టమాటా ఇప్పుడు రూ.10కి వచ్చేసింది. రైతుబజార్లలో ఆదివారం కిలో చిన్నవి రూ.8, పెద్దవి రూ.10గా నిర్ణయించారు. ఆ మధ్య ఉల్లిపాయల ధర కిలో రూ.40 వరకు వెళ్లింది. ఎక్కువకాలం కిలో రూ.36 చొప్పున రైతుబజార్లలో విక్రయించారు. బయట ఆటోల్లో వంద రూపాయిలకు మూడు కిలోల చొప్పున ఇస్తున్నారు. బంగాళాదుంపలు ఎక్కువ కోల్‌కతానుంచి వస్తాయి. రైతులు కొత్త దుంపలు తీసుకురావడంతో ధరలు తగ్గాయి. గతంలో కిలో రూ.40పైనే పలికిన దుంపలు ఇప్పుడు రూ.24-రూ.32కే ఇస్తున్నారు. క్యాబేజీ, కాలీఫ్లవర్లు గతనెలలో కిలో రూ.30 చొప్పున విక్రయించారు. ఇప్పుడు ఈరెండూ కిలో రూ.15 నుంచి రూ.20కే దొరుకుతున్నాయి. క్యారెట్ ఒక సమయంలో కిలో రూ.60 చొప్పున విక్రయించారు. ఇటీవల కిలో రూ.50కి దిగిరావడం కష్టమైంది. ఇప్పుడైతే కిలో రూ.30కే దొరుకుతోంది. చిక్కుళ్లు కిలో రూ.58 ఉండేవి, ఇప్పుడు రూ.26కి ఇస్తున్నారు. నీటి, మువ్వ, మెట్ట వంకాయలు కిలో రూ.40-రూ.60 పలికేవి ఇవికూడా కిలో రూ.14నుంచి రూ.20కి లభిస్తున్నాయి. గ్రీన్‌పీస్(బఠాణీలు) జనవరి మొదటివారంలో కిలో రూ.100పైనే విక్రయించారు. ఇప్పుడు కిలో రూ.70కే అమ్ముతున్నారు. బీరకాయలు, బెండకాయల ధర మాత్రం తగ్గలేదు. ప్రస్తుతం బీర కిలో రూ.58, బెండకాయలు కిలో రూ.30 చొప్పున విక్రయిస్తున్నారు. అల్లం కిలో రూ.100 వరకు ధర పలకగా ఇప్పుడు కొత్తదిరావడంతో రూ.46కే ఇస్తున్నారు. పుదీనా, కొత్తిమీర, ఆకుకూరల ధరలు తగ్గడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గీత కులాలకు మద్యం దుకాణాల కేటాయింపునకు

నేటి లాటరీ వాయిదా

కలెక్టరేట్(కాకినాడ)/సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గీత కార్మికులకు కేటాయించిన 16 మద్యం దుకాణాలకు లాటరీ ప్రక్రియను వాయిదా వేస్తున్నట్లు కాకినాడ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారిణి ఎం.కృష్ణకుమారి ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. గీత కులాలకు మద్యం దుకాణాల కేటాయింపు కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నోటిఫికేషన్ జారీ చేసిందని, దీని ప్రకారం సంబంధిత కులాలనుంచి దరఖాస్తులను ఆదివారం వరకు స్వీకరించామన్నారు. దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసిందని, షెడ్యూలు ప్రకారం 16 మద్యం దుకాణాలకు ఈ నెల 10న కాకినాడ కలెక్టరేట్‌లో డ్రాయిల్ ఆఫ్ లాట్(లాటరీ) నిర్వహించాల్సి ఉందన్నారు. ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో మోడల్‌కోడ్ ఆఫ్ కాండాక్ట్(ఎంసీసీ) అమల్లో ఉన్నందున లాటరీ కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు తెలియజేశారు. మద్యం దుకాణాలకు మళ్లీ ఎప్పుడు లాటరీ నిర్వహించేది త్వరలో ప్రకటన విడుదల చేస్తామని తెలిపారు.

నేడు పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి రాజశేఖర్ నామినేషన్

- కాకినాడ నుంచి ఏలూరు టీడీపీ కార్యాలయం వరకు కార్ల ర్యాలీ
- కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు



పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్

కాకినాడసిటీ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ ఈనెల 10న ఏలూరు కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు చేయనున్నారు. సోమవారం ఉదయం 7గంటలకు కాకినాడలోని టీడీపీ జిల్లా కార్యాలయంనుంచి కార్ల ర్యాలీగా బయలుదేరనున్నారు. ఉదయం 7.30 గంటలకు రామచంద్రపురం, 8.15గంటలకు మండపేట, 8.45గంటలకు రావులపాలెం, 9.10 గంటలకు తణుకు, 9.30 గంటలకు తాడేపల్లిగూడెం, 9.45గంటలకు ఉంగుటూరు, 10 గంటలకు ఏలూరు టీడీపీ కార్యాలయానికి చేరుకోనున్నారు. అక్కడినుంచి ఏలూరు కలెక్టరేట్‌కు ఉదయం 11గంటలకు చేరుకుని నామినేషన్ దాఖలు చేయనున్నారు. భారీసంఖ్యలో కార్లతో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ నామినేషన్ ర్యాలీకి కూటమి నేతలు సన్నాహాలు చేశారు.

కాకినాడ జేఎన్టీయూకు ఏపీ ఈఏపీసెట్ నిర్వహణ బాధ్యతలు 7

బంగారుపాప ఉరుస్ ఉత్సవాలకు.. భారీగా పోటెత్తిన భక్తులు 7

భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలి

- జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి మరో కీలక ముందడుగు పడిందని జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఎంతోమంది నిరుపేదలకు లబ్ధి చేకూరనుందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఈజీగా క్రమబద్ధీకరణ చేసుకునేందుకు అవకాశం దక్కిందన్నారు. ఈ పథకానికి సంబంధించి మీసేవా కేంద్రాలు, గ్రామ, వార్డు, సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకునే విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. జీవో నెంబరు 30ని అనుసరించి ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం 2025 పేరిట భూముల క్రమబద్ధీకరణ చేపడతామన్నారు. ఈ సంవత్సరం డిసెంబరు 31 వరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. క్రమబద్ధీకరణ పట్టాలను మహిళల పేరిట మాత్రమే జారీ చేస్తామన్నారు. క్రమమద్ధీకరణకు లబ్ధిదారులకు పట్టా, కన్వేయన్స్ డీడ్ అందజేసిన రెండేళ్ల తర్వాత యజమాన్య హక్కులు జారీ చేస్తామన్నారు. 2019 అక్టోబరు 15ను ప్రమాణిక తేదీగా తీసుకుని ఆ తేదీ కంటే ముందు ఆక్రమణల్లో ఉన్న భూములను నిబంధనలు అనుసరించి క్రమబద్ధీకరిస్తామన్నారు.సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు సీసీఎల్ఏ అధికారులు అత్యంత వేగంగా, ప్రామాణికమైన దరఖాస్తు విధానాన్ని మీసేవ ద్వారా అందుబాటులోకి తీసుకువచ్చారు. 150గజాల ఉచితంగా క్రమబద్ధీకరణ చేస్తామన్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు సైతం చెల్లించక్కర్లేదని తెలిపారు. దారిద్ర్యరేఖకు దిగువున ఉండి 151 నుంచి 300 గజాల లోపు ఆక్రమణలకు బేసిక్ ధరలో 15శాతం, రిజిస్ట్రేషన్ ఫీజులో 50శాతం చెల్లించాలన్నారు. దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్నవారు పూర్తి రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలి. 300 నుంచి 450 గజాల పరిధిలో బీపీఎల్ కుటుంబాలవారు వంద శాతం బేసిక్ ధర, 50శాతం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలన్నారు. అర్హుల జాబితాపై అభ్యంతరాలుంటే జేసీకి 30రోజుల్లోగా అప్పీలు చేసుకోవచ్చన్నారు. అర్హులజాబితా ఖరారైన తర్వాత ఈ వివరాలను తహసీల్దార్లు ఈప్రాంత సబ్-రిజిస్ట్రార్లు, జిల్లా రిజిస్ట్రార్లకు పంపుతారన్నారు. చివరి నిమిషం వరకు వేచి చూడకుండా అర్హులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. లేఅవుట్‌స్థలాలు, కాలువలు, నదీ ప్రవాహ గట్లు, మాస్టర్ ప్లాన్, జోనల్ ప్లాన్‌లో నిర్దేశిత స్థలాలు, జలవనరులకు సంబంధించిన స్థలాల్లో క్రమబద్ధీకరణ చేయలేమన్నారు. గరిష్ఠంగా గ్రామాల్లో నెలకు రూ.10వేలు, పట్టణాల్లో నెలకు రూ.14వేలు ఆదాయం ఉన్నవారు దీనికి అర్హులుగా నిర్ణయించామన్నారు. నెలకు రూ.300 లోపు విద్యుత్తుచార్జీల చెల్లింపు ఉండాలన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ రద్దు

- కలెక్టర్ షాన్‌మోహన్
- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా ఈవారం రద్దు

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా కాకినాడ జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం రద్దు చేశామని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు ఎవరైనా ఫిర్యాదు చేయాలనుకుంటే సంబంధిత సచివాలయంలో మీకోసం పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహుడి గ్రామోత్సవం

● గజ వాహనంపై ఊరేగిన స్వామివారు
● పెద్దసంఖ్యలో హాజరైన భక్తులు

అంతర్వేది, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని ఆలయంలో బారులు తీరారు. తొలుత పొలమూరి వారి వార్షిక అభిషేకం నిర్వహించారు. ఈ అభిషేకంలో పొలమూరి కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొని విశేష పూజలు చేశారు. అనంతరం సాయంత్రం నాలుగు గంటలకు లక్కవరం వాస్తవ్యులు మంగెన నాగేశ్వరరావు వారిచే నిర్మితమైన గజ వాహనంపై స్వామివారిని ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి వెంట నారసింహ, గోవిందనామస్మరణ చేశారు. శృంగవరప్పాడు వాస్తవ్యులు రావివెంకట సత్యనారాయణ, శ్రీహరిరావు వారిచే పొన్నవాహనంపై స్వామివారి గ్రామోత్సవం రాత్రి ఎనిమిది గంటలకు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి హారతులు పట్టారు.


అంతర్వేదిలో స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

● అన్న పర్వత మహా నివేదన

కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామివారికి ఆదివారం రాత్రి 7 గంటలకు అన్నపర్వత మహానివేదన జరిపారు. తొలుత సాయంత్రం 5 గంటల నుంచి స్వామివారి దర్శనాలు నిలిపివేసి ఆలయాన్ని శుద్ధి చేశారు. అనంతరం పశ్చిమ గోదావరి జిల్లా పొలమూరుకు చెందిన కలిదిండి వంశీయులు క్వింటాల్ బియ్యంతో అన్నం వండించారు. స్వామివారి మూల విరాట్ ఎదుట ఉన్న గంట మండపంలో అన్నాన్ని రాశిగా పోశారు. రెండు రకాల కూరలు, పప్పు, పులుసు, పెరుగు, నెయ్యి, బూరెలతో స్వామివారికి మహానివేదన జరిపారు. ప్రధాన అర్చకులు, స్థానాచార్యులు వింజమూరి రామరంగాచార్యులు, పాణింగపల్లి శ్రీనివాస కిరణ్, వేదపండితులు చింతా వెంకటశాస్త్రి, అర్చక స్వాములు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తిరిగి భక్తులకు స్వామి వారి దర్శన భాగ్యం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజాకలిదిండి కుమారరామగోపాల రాజాబహదూర్, పొలమూరు వంశీయులు, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, ఉత్సవ కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, పినిశెట్టి బుజ్జి, ముప్పర్తి నాని, గుబ్బల ఫణికుమార్, బైరా నాగరాజు, ఉండపల్లి అంజి, పోతురాజు శ్రీవెంకటకృష్ణ, వనమాలి మూలాస్వామి, వలవల రాంబాబు, పొలమూరి సత్రం నిర్వాహకులు, అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.


పొన్నవాహనంపై స్వామివారి గ్రామోత్సవం

● అంతర్వేదిలో నేడు..

స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు స్వామివారికి హనుమద్ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించనున్నారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు పండిత సదస్యం, 7 గంటలకు సింహ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరగనున్నట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు.

'నాటిక కళాకారులను ప్రోత్సహించడమే లక్ష్యం'


రావులపాలెంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు నాగమోహన్‌రెడ్డి, రూపశిల్పి వెంకటరెడ్డి

రావులపాలెం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): నాటిక కళాకారులను ప్రోత్సహించడమే లక్ష్యమని సీఆర్సీ అధ్యక్షుడు తాడి నాగమోహన్ రెడ్డి, రూపశిల్పి గొలుగూరి వెంకటరెడ్డి, కార్యదర్శి కర్రి అశోక్‌రెడ్డి అన్నారు. కోనసీమ జిల్లా రావులపాలెం సీఆర్సీ ఓల్డేజ్ హోమ్‌లో మీటింగ్ హాలులో ఆదివారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఆర్సీ కాటన్ కళాపరిషత్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఉగాది నాటిక పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ఏడాదీ మార్చి 30, 31, ఏప్రిల్ 1వ తేదీన సీఆర్సీ ఉగాది నాటికపోటీలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ పోటీలకు రాష్ట్రస్థాయి నుంచి ఏడునాటికలను ఎంపిక చేయ డం జరిగిందన్నారు. ఇందులో అమరావతి ఆర్ట్స్, గుంటూరి వారి చిగురుమేఘం, విశ్వశాంతి కల్చరల్ అసోషియేషన్ హైదరాబాద్ వారి స్వేచ్ఛ, మైత్రి కళానిలయం విజయవాడ వారి బ్రహ్మ స్వరూపం, శ్రీసాయి ఆర్ట్స్ గొలకలూరు జనరల్ భోగిలు, మిత్ర క్రియేషన్స్ హైదరబాద్ వారి ఈ రహదారి కాదు, అరవింద ఆర్ట్స్ తాడేపల్లివారి విడాకాలు కావాలి, సహృదయ ద్రోణాదుల వారి వర్క్‌ఫ్రమ్ హోమ్ నాటికలను ప్రదర్శించడం జరుగుతుందన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన ఉత్తమ నాటికలకు మొదటి బహుమతి రూ.లక్ష, రెండో బహుమతి రూ.75 వేలు మూడో బహుమతి రూ.50 వేలుగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో మల్లిడి అంజనీకుమార్‌రెడ్డి, త్రిమూర్తులు, చిర్ల కనికిరెడ్డి, సూర్య, కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బాక్సింగ్ క్రీడాకారుల ఎంపిక

పిఠాపురం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో రాష్ట్ర స్థాయి బాక్సింగ్ క్రీడాకారుల ఎంపిక జరిగింది. బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం బాక్సింగ్ పోటీలు నిర్వహించారు. ఇందులో సీనియర్ మహిళల బాక్సింగ్ జట్లను ఎంపిక చేశారు. కాకినాడ జిల్లాకు చెం దిన బాక్సర్లు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభ కనబరిచారు. నాలుగు విభాగాలకు గాను నలుగురు బాక్సర్లను రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యారు. 48 కిలోల విభాగంలో కె.అక్షయ (తుని), 51 కిలోల విభాగంలో ఎం.రాజరాజేశ్వరీ (చిత్రాడ), 54 కిలోల విభాగంలో ఆర్‌జీ ఎన్ గంగాభవానీ(తుని), 80 ప్లస్ ఓపెన్ వెయిట్ కేటగిరిలో జే.ఐశ్వర్య సూర్య దీపిక (పిఠాపురం) కాకినాడ జిల్లా జట్టుకు ఎంపిక కాగా, వీరు ఈనెల 11,12వ తేదీల్లో విశాఖపట్టణంలో జరగనున్న రాష్ట్రస్థాయి సీనియర్ ఉమెన్స్ బాక్సింగ్ పోటీల్లో పాల్గొంటారని బాక్సింగ్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.లక్ష్మణరావు తెలిపారు.


పోటీలకు ఎంపికైన కాకినాడ జిల్లా క్రీడాకారులు

కార్యక్రమంలో కౌన్సిలర్ రాయుడు శ్రీను, అసోసియేషన్ ప్రతినిధులు ఇమ్మిడిశెట్టి నాగేంద్రకుమార్, జి.శివప్రసాద్, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుడి నిత్యాన్నదానానికి రూ.2 లక్షల విరాళం

అన్నవరం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి, గోసంరక్షణ ట్రస్టులకు ఆదివారం దేవస్థానం వ్రతపురోహిత సంఘం అధ్యక్షుడు చామర్తి కన్నబాబు, గుత్తిన శ్రీనివాస్ డ్యూటీ తరఫున సత్యదేవ నిత్యాన్నదానానికి రూ.లక్ష, సత్యదేవ గోసంరక్షణ ట్రస్ట్‌కు మరో రూ. లక్ష విరాళంగా సమర్పించారు. ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్‌కు డ్యూటీసభ్యు లు అందజేశారు. వారిని ఈవో, చైర్మన్ అభి నందించారు. అల్లంరాజు శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాకినాడ జేఎన్టీయూకు
ఏపీ ఈఏపీసెట్ నిర్వహణ బాధ్యతలు

● చైర్మన్‌గా వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ, కన్వీనర్‌గా వీవీ సుబ్బారావు


చైర్మన్ వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ


కన్వీనర్ వీవీ సుబ్బారావు

జేఎన్టీయూకే, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్టాత్మక ఏపీఈఏపీ సెట్ 2025-26 ప్రవేశపరీక్ష నిర్వహణ బాధ్యతను కాకినాడ జేఎన్టీయూకు అప్పగించారు.ఇంజనీరింగ్, ఫార్మసీ, వ్యవసాయ, తదితర కీలక కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి పరీక్షల నిర్వహణ బాధ్యత తొమ్మిదోసారి దక్కింది. అయితే పరీక్ష నిర్వహణకు సంబంధించి జేఎన్టీయూకే ఇన్‌ఛార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఇప్పటి వరకు 2015 నుంచి 2019 వరకు కన్వీనర్‌గా ప్రొఫెసర్ సీహెచ్ సాయిబాబు ఆధ్వర్యంలో ఐదుసార్లు ఏపీఈఏపీ సెట్‌ను నిర్వహించారు. అలాగే ప్రొఫెసర్ వి.రవీంద్ర కన్వీనర్‌గా 2021, 2022లో రెండుసార్లు, ప్రొఫెసర్ కె.వెంకటరెడ్డి ఆధ్వ ర్యంలో 2024లో ఒకసారి ఈ ప్రవేశపరీక్షను జేఎన్టీయూకే నిర్వహించింది. గత ఏడాది పలు కోర్సు ల్లో ప్రవేశాల కోసం అత్యధికంగా 3,46, 424 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడం విశేషం. ఈ సారి ఏపీఈఏపీసెట్ 2025-26 ఏడాదికి 9వ సారి వర్శిటీ పూర్వపు రిజిస్ట్రార్ వీవీసుబ్బారావును కన్వీనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన గతంలో పీజీ సెట్‌తో పాటు కాపు విద్యోన్నతి అర్హత పరీక్షలు, ఉమ్మడి ఏపీలో ఎంసెట్ యూసీఈకే కౌన్సిలింగ్ సెంటర్ సమన్వయకర్తగాను వ్యవహరించడంతోపాటు పలు ఉద్యోగ ప్రవేశపరీక్షలు నిర్వహించారు.

గరుడ వాహనంపై భీమేశ్వరుడి నగరోత్సవం


గరుడ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

ద్రాక్షారామ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వర స్వామివారి కల్యాణమహోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం స్వామివారికి గరుడ వాహనంపై నగరోత్సవాన్ని నిర్వహించారు. రాత్రి ఎనిమిది గంటలకు మేళతాళాలతో మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామివారు, చండికా సమేత సూరేశ్వరస్వామివారు, లక్ష్మీసమేత నారాయణస్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పోటీతత్వం ఉండాలి

● అవగాహన సదస్సులో తిరుమల విద్యా సంస్థల చైర్మన్ తిరుమలరావు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మానసికంగానే కాకుండా శారీరకంగా కూడా దృఢంగా ఉండేలా విద్యార్థులను తయారు చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు అన్నారు.విశాఖ జిల్లా పాయకరావుపేట తిరుమల విద్యా సంస్థల ఆవరణలో ఆది వారం 10వ తరగతి పూర్తి చేస్తున్న విద్యా ర్థులు,వారి తల్లిదండ్రులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సదస్సుకు సుమారు 5 వేల మంది హాజరైనట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా జరిగే ఇంజనీరింగ్ (జేఈఈ మెయిన్స్ అండ్ అడ్వాన్స్), నీట్ పరీక్షలకు ఎంతో పోటీ ఉందన్నారు. ఆ ఒత్తిడిని తట్టుకుని నిలిచేలా పిల్లలను సన్నద్ధం చేసి నప్పుడే వారు వృద్ధిలోకి వస్తారన్నారు. విద్యా ర్థుల్లో పోటీతత్వం ఉండాలన్నారు.ఈ సదస్సులో జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్,నీట్‌లో విద్యార్థులు ఎదుర్కొనే పలు ఇబ్బందులపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.డైరెక్టర్ నున్న సరోజినిదేవి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను సరైన మార్గంలో పెంచాలన్నారు. విలువలతో కూడిన విద్యను పిల్లలకు అందించాలన్నారు. సదస్సులో పలువురు తల్లిదండ్రులు తమ అనుభవాలు పంచుకున్నా రు.కార్యక్ర మంలో ప్రిన్సిపాల్స్ వి.శ్రీహరి, కె.విజ య్‌కుమార్, స్కూల్ ఇన్‌చార్జి ఎం.సునీత, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న చైర్మన్ తిరుమలరావు

పెళ్లయిన ఏడాదికే..యువకుడి ఆత్మహత్య

అనపర్తి ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) :పెళ్లయిన ఏడాదికే ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తికి చెందిన తమలంపూడి సాయి సాకేత్‌రెడ్డి (29) కొంతకాలంగా మానసికంగా బాధపడుతున్నాడు. ఇదిలా ఉండగా ఆదివారం పురుగుల మందు తాగాడు. దాన్ని గుర్తించిన బంధువులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు.మృతుడి తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అనపర్తి ఎస్ఐ శ్రీను నాయక్ తెలిపారు. కుటుంబీకులు బోరున విలపించారు.


సాయి సాకేత్‌రెడ్డి (ఫైల్)

ఇసుకలో బండి జారి..
లారీ కిందకు..

● బొబ్బిల్లంకలో యువకుడి మృతి

సీతానగరం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలివి ... తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం బొబ్బిల్లంక వద్ద ఆదివారం జరిగింది. సీతానగరం మండలం చినకొండేపూడికి చెందిన దంతే ప్రసాద్ (26) రాజమహేంద్రవరం రూరల్ మండలంలో ఓ శుభకార్యానికి హాజరై తిరిగి వస్తుండగా... బొబ్బిల్లంక వద్ద ఇసుక కుప్పలు అడ్డు వచ్చాయి. దీంతో బండి స్కిడ్ అవడంతో అటుగా వస్తున్న లారీ వెనుక చక్రాల కింద పడిపోయాడు. మృతుని తలపై నుంచి లారీ వెళ్లడంతో సంఘటనా స్థలంలోనే ప్రసాద్ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. మృతుడికి ఇంకా వివాహం కాలేదు. ఈయనకు తండ్రి అబ్బులు, తల్లి చిన్నబుల్లి , ముగ్గురు సోదరులు ఉన్నారు.

బంగారుపాప ఉరుసు ఉత్సవాలకు ..
భారీగా పోటెత్తిన భక్తులు

కొత్తపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం పొన్నాడలో వేంచేసి ఉన్న బషీర్‌బీబీ ఔలియా 70వ (బంగారుపాప) ఉరుసు ఉత్సవాలకు భక్తులు భారీగా పోటెత్తారు. ఉత్సవాల్లో ఆఖరిరోజైన ఆదివారం జిల్లా నలు మూలల నుంచి హిందూ, ముస్లిం భక్తులు భారీగా తరలివచ్చారు. ప్రతి ఏడాది మధ్యా హ్నం మూడు గంటలు దాటిన తర్వాత భక్తులు దర్శనానికి వచ్చేవారు కాదు. కానీ ఈ యేడాది ఉదయం నుంచీ బారులు తీరడం గమనార్హం. సాయంత్రమయ్యే కొద్దీ భక్తుల రద్దీ పెరగడంతో సీఐ జి.శ్రీనివాస్, ఎస్ఐ జి.వెంకటేష్ నేతృత్వంతో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా బందోబస్తును ఏర్పాటు చేశారు.


దర్శనానికి లైన్‌లో వేచి ఉన్న భక్తులు

మాస్టర్ అథ్లెటిక్స్‌లో పతకాల పంట

● సత్తా చాటిన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు
● 32 బంగారం, 12 రజతం, 8 కాంస్య పతకాలు
● మార్చ్‌ఫాస్ట్‌లో రాష్ట్ర స్థాయిలో ప్రథమం


మాస్టర్ అథ్లెటిక్స్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులు

కాకినాడ అర్బన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): అనంతపురం పోలీస్ శిక్షణ కేంద్రం మైదానంలో శని, ఆదివారాల్లో నిర్వహించిన మాస్టర్ అథ్లెటిక్స్ రాష్ట్ర స్థాయి చాంపియన్ షిప్‌లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. 13 జిల్లాల నుంచి మొత్తం 500 మంది క్రీడాకారులు పాల్గొనగా, ఉమ్మడి జిల్లా నుంచి 29 మంది హాజరై వివిధ పోటీల్లో పతకాలు సాధించారు. 30 నుంచి 90 ఏళ్ల వయస్సు గల క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో 32 బంగారు, 12 రజత, 8 కాంస్య పతకాలు వచ్చాయి.

మార్చ్‌పాస్ట్ విభాగంలో రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచారు. ఈసందర్భంగా క్రీడాకారులను మాస్టర్స్ అథ్లెటిక్స్ సం ఘం ఆదివారం అభినందించింది. సంఘ జిల్లా అధ్యక్షుడు బి.కృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో 52 పతకాలను జిల్లా క్రీడాకారులు సాధించడం అభినందనీయమన్నారు. క్రీడాకారులను డీఎస్‌డీవో బి.శ్రీనివాసకుమార్, అథ్లెటిక్స్ సంఘ కార్యదర్శి బాపిరాజు, పీఈటీ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.జార్జి, ఒలింపిక్ సంఘ రాష్ట్ర సీఈవో చంద్రు గోవిందరాజు, చీఫ్ ప్యాట్రన్ కర్రి భామిరెడ్డి, తదితరులు అభినందించారు.

ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి వ్యాయామోపాధ్యాయుల క్రీడా పోటీలు

కాకినాడఅర్బన్,ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి వ్యాయామ ఉపాధ్యాయుల క్రీడాపోటీలు కాకినాడలోని జిల్లా క్రీడామైదానంలో ఆదివారం ఉత్సాహంగా సాగాయి. వివిధ జిల్లాల నుంచి వచ్చిన వ్యాయామఉపాధ్యాయులు పలు క్రీడల్లో తమ ప్రతిభను చాటారు. అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ, హాకీ, బ్యాడ్మింటన్‌లో పోటీలు నిర్వహించారు. విజేతలకు వ్యాయామ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర నాయకులు బహుమతులు అందజేశారు. రాష్ట్ర అధ్యక్షుడు లంకా జార్జి, జిల్లా అధ్యక్షుడు వి.రవిరాజు, లంక గోవిందరాజులు, పప్పుల శ్రీరామచంద్రమూర్తి, నూకరాజు, రవి సుందర్‌కౌర్, తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయి వ్యాయామ ఉపాధ్యాయుల క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులు

20 వరకు రైళ్లు ఆలస్యం

ఇంటర్‌లాకింగ్ పనులే కారణం

సామర్లకోట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం రైల్వేస్టేషన్ వద్ద జరుగుతున్న ఇంటర్‌లాకింగ్ పనుల వల్ల ఈ నెల 10వ తేదీ నుంచి 20 వరకు సామర్లకోట మీదుగా సికింద్రాబాద్‌కు వెళ్లే కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు 75 నిమిషాల నుంచి 90 నిమిషాల పాటు ఆలస్యంగా నడుస్తాయని రైల్వే పీఆర్‌వో కార్యాలయం నుంచి శనివారం రాత్రి ఆదేశాలు అందాయి. ఈమేరకు సామర్లకోట రైల్వే ఉన్నతాధికారికి అందిన సమాచారాన్ని 'ఆంధ్రజ్యోతి' సేకరించింది. 20834 నెంబరు గల వందే భారత్ (సికింద్రాబాద్ - విశాఖ) మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ 19,20 తేదీలలో 75 నిమిషాలు ఆలస్యంగా బయలుదేరుతుంది.

ఆర్టీసీ డ్రైవర్‌పై..
ఆటో వాలా దాడి

● పాత కక్షలతోనే ఘటన

కరప, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పాత కక్షల నేపథ్యంలో ఆర్టీసీడ్రైవర్‌పై ఓ ఆటో వాలా కత్తితో దాడిచేసి తీవ్రంగా గాయపర్చాడు. కరప పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా కరప మండలం కూరాడకి చెందిన కేదాసి సూరిబాబు ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన మేడపాటి శ్రీనివాసరావు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు.కాగా ఆదివారం మధ్యాహ్నం సూరిబాబు వేళంగి-జి.బావారం రోడ్డులో వైన్ షాప్ దగ్గర్లో నిలబడి ఫోన్ మాట్లాడుతుండగా, అక్కడకు శ్రీనివాసరావు ఆటోలో వచ్చి కత్తితో సూరిబాబుపై దాడి చేశాడు. దీంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. ఏడాది క్రితం అంబేడ్కర్ జయంతి రోజున భోజనాల వద్ద వీరిద్దరికీ గొడవ జరిగిందని, దాన్ని మనసులో పెట్టుకుని చంపాలనే ఉద్దేశంతో శ్రీనివాసరావు దాడి చేసినట్టు బాధితుడు సూరిబాబు తెలిపారని ఎస్ఐ తోట సునీత చెప్పారు.

కోడి పందాల శిబిరంపై పోలీసుల దాడి

● నలుగురి అరెస్టు

కొవ్వూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కోడి పందాల శిబిరంపై పోలీసులు దాడి చేసి నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ కె.జగన్మోహనరావు తెలిపారు. కొవ్వూరు మండలం వాడపల్లిలో ఆదివారం కోడి పందాలు నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో పట్టణ పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.16,800 నగదు, రెండు కోళ్లు, రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

కాకినాడ

వేట్లపాలెంలో విశేష పూజలు

సామర్లకోట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వేట్లపాలెంలో వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారు ఆధ్వర్యంలో ఉత్సవ మూర్తులను గరుడవాహనంపై అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయం ఆవరణలో మహాన్నదానం కార్యక్రమం చేపట్టారు.

'పేరాబత్తులను అఖండ మెజార్టీతో గెలిపించాలి'



కరప : పెనుగుదురులో గ్రాడ్యుయేట్ ఓటర్లకు కరపత్రాలందిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

కరప, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. కరపమండలం పెనుగుదురులో ఆదివారం సాయంత్రం గ్రాడ్యుయేట్స్ ఓటర్లతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ సౌమ్యుడని, నిస్వార్థంగా ప్రజలకు సేవ చేసే అతనికి ఓట్లేసి ఎగువసభకు పంపించాలని కోరారు. కాకినాడ రూరల్ ఎన్నికల పరిశీలకులు కుడుపూడి సత్తిబాబు,సీతంరాంజు సుధాకర్ మాట్లాడుతూ పేరాబత్తులను అఖండ మెజార్టీతో గెలిపించే బాధ్యత అందరూ తీసుకోవాలని సూచించారు. పలువురు గ్రాడ్యుయేట్స్ ఓటర్లకు కరపత్రాలను అందజేసి మొదటి ప్రాధాన్యత ఓటును రాజశేఖర్‌కు వేయాలని విజ్ఞప్తిచేశారు. తదనంతరం నడకుదురులో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమాల్లో కూటమి నేతలు నులుకుర్తి వెంకటేశ్వరరావు, పీజీ సత్యనారాయణ, డాక్టర్ బొండా సూర్యారావు, తుమ్మలపల్లి మాచరరావు, రెడ్డిపల్లి నారాయణరావు, తుమ్మలపల్లి గోవిందరాజులు, మామిడాల వెంకటేష్, కర్నాసుల పుష్పరాజు, బండారు మురళి, దూడల నారాయుడు, యాసలపు విష్ణు, చీపురపల్లి జయేంద్రబాబు తదితరులున్నారు.

టీడీపీ శ్రేణుల ప్రచారం

పెద్దాపురం (సామర్లకోట), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కూటమి బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ గెలుపు కోరుతూ ఆదివారం టీడీపీ శ్రేణులు పెద్దాపురం మండలం చదలాడ, తిరుపతి, దివిలి గ్రామాల్లో పెద్దాపురం పట్టణ పరిధిలో 8,9 వార్డుల్లో జోరుగా నిర్వహించారు. సామర్లకోట మండలం పనసపాడులో సర్పంచ్ చీకట్ల వెంకటేష్ ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు ఇంటింటా పర్యటించి రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటును వేసి గెలిపించాలని కరపత్రాలను అందజేశారు. సామర్లకోట పట్టణంలో చిన్నవీధి, బళ్ళ మార్కెట్, గొల్లగూడెం రోడ్డు తదితర ప్రాంతాల్లో టీడీపీ నేత హరిబాబు ఆధ్వర్యంలో ప్రచారం చేశారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగులు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాకినాడ కలెక్టరేట్ వద్ద ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా 108 ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాట్ల రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.త్రిమూర్తులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు పూర్తవుతున్నా 104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. ఉద్యోగులను కొనసాగించడమే కూటమి ప్రభుత్వం చేసే గొప్ప మేలుగా చెబుతూ వేతనాలు పెంచడంపై దాట వేస్తోందని విమర్శించారు. పీఎఫ్ యాజమాన్య వాటా, కార్మికుల వాటా రెండు కూడా సీటీసీ పేరుతో ఉద్యోగుల జీతాలు నుంచే కోత పెడుతున్నారన్నారు. తక్షణం యాజమాన్య వాటా ప్రభుత్వమే చెల్లించాలని, ధరలకనుగుణంగా వేతనాలు పెంచాలని, సర్వీసుల ఆధారంగా ఉద్యోగుల స్లాబ్‌ను మార్చాలని, అరబిందో నుంచి 4 ఏళ్ల ఇంక్రిమెంట్ బకాయిలు ఉద్యోగులకు ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో 104 ఉద్యోగుల సంఘం కోశాధికారి సీహెచ్ శ్రీనివాస్, డివిజన్ నాయకులు కె.సతీష్, సువర్ణరాజు, ఎస్‌కే.ఖలీసా, దుర్గాప్రసాద్, సుబ్రహ్మణ్యం, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్సీగా గెలిపిస్తే ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం'



సమావేశంలో మాట్లాడుతున్న వీరరాఘవులు

కలెక్టరేట్ (కాకినాడ), ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్లు అందరూ తమ తొలి ప్రాధాన్యత ఓటు వేసి తనను గెలిపించాలనీ, గెలిచిన తర్వాత ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని పీడీఎఫ్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులు పేర్కొన్నారు. కాకినాడ యూటీఎఫ్ హోంలో ఆదివారం వివిధ ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక సంఘాలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తనను ఎన్నికల్లో గెలిపించిన తర్వాత శాసనమండలిలో ప్రశ్నించే గొంతుకగా ఉంటామన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సూరిబాబు, నగేష్, రాష్ట్రకార్యదర్శులు చక్రవర్తి, జ్యోతిబసు, పెన్షనర్ల సంఘం అధ్యక్షులు సత్తిరాజు, నాయకులు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన త్యాగరాజస్వామి పంచరత్న కీర్తనలు



పిఠాపురంలో కీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు

పిఠాపురం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో వేంచేసి ఉన్న రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో కొలువైన త్యాగరాజస్వామి వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. సద్గురు త్యాగరాజ సంగీత సమాఖ్య ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విశాఖపట్టణం సంగీత జనకులం ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి నుంచి 100మంది సంగీత కళాకారులు పంచరత్న కీర్తనలు ఆలపించారు. త్యాగరాజ ఘన రాగకీర్తనలతో ఆహూతులను అలరించారు. ముందుగా ఆలయం వద్ద నుంచి పట్టణంలో త్యాగరాజస్వామి నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. త్యాగరాజస్వామి మహిళలు హారతులు ఇస్తూ, కళాకారులు కీర్తనలు ఆలపిస్తుండగా సంకీర్తన కార్యక్రమం జరిగింది. కళాకారులకు మృదంగంపై ఏ.కామేష్, అనిల్, వయోలిన్‌పై శ్రీరామ్ వాద్య సహకారం అందించారు. డాక్టర్ జోగా వీరబాలాజీ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకుడు పి.విజయజనార్ధనాచార్యులు ఏర్పాట్లు పర్యవేక్షించగా, ఈవో నున్న శ్రీరాములు, గట్టి శ్రీకృష్ణదేవరాయులు, జనసేన నాయకులు సూరవరపు సురేష్, చల్లా లక్ష్మీ, జోగా వెంకట రమణ, ఆలయ సేవాసమితి అధ్యక్షుడు శ్రీనివాస్, మల్యాల రామలక్ష్మీ, సుబ్బరాయశర్మ, వి.గాయత్రి తదితరులు ఉన్నారు.

కాకినాడ నుంచి కుంభమేళాకు మూడు బస్సులు

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): కాకినాడ డిపో నుంచి ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు ఆదివారం రెండు స్టార్ లైనర్ బస్సులు, ఒక సూపర్ లగ్జరీ స్పెషల్ బస్సును జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.శ్రీనివాసరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ బస్సులు కాకినాడ నుంచి బయలుదేరి భువనేశ్వర్, పూరి, కోణార్క్ మీదుగా ప్రయాగ్‌రాజ్ చేరుకుని అక్కడ త్రివేణి సంగమంలో పవిత్ర స్నానాలు పూర్తి చేసి తిరుగు ప్రయాణంలో వారణాసి, గయా, బుద్ధగయ క్షేత్రాలు చూపించి తిరిగి ఫిబ్రవరి 16న కాకినాడ చేరుతాయన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, అసిస్టెంట్ ఇంజనీర్ కె.ప్రభాకర్‌రావు, పీఆర్వో సీహెచ్.వెంకటరాజు, యూనియన్ నాయకులు ఉన్నారు.

భద్రాచల దివ్య రథోత్సవ పాదయాత్ర

పెద్దాపురం (సామర్లకోట) ఫిబ్రవరి 9: (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి సీతారామ దివ్య రథోత్సవ పాదయాత్ర ఆదివారం ఉదయం పెద్దాపురం మట్టే వారి ఫంక్షన్ హాలు నుంచి వాసుదేవ గురుస్వామి ఆధ్వర్యంలో ప్రారంభమైంది. 150 మంది భక్తులు ఉత్సవ మూర్తులను ప్రతిష్ఠించిన రథాన్ని తాడు లాగుతూ రెండో రోజైన ఆదివారం కొన సాగించారు. పెద్దాపురం శివారు పామాయిల్ తోటల వద్ద సామర్లకోట మాజీ జెడ్పీటీసీ గుమ్మళ్ళ విజయలక్ష్మీ రామకృష్ణ దంపతుల సౌజన్యంతో భక్తులకు అల్పాహారం అందించారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్ట్

పెద్దాపురం (సామర్లకోట), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం పట్టణ పరిధిలో సుధాకాలనీలో ఒక ఇంటిలో పేకాడుతున్న ఆరుగురిని ఆదివారం పెద్దాపురం ఎస్ఐ మౌనిక తన సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.52,210 స్వాధీనం చేసుకున్నారు. సోమవారం కోర్టు ఎదుట హాజరుపర్చనున్నట్టు ఎస్ఐ మౌనిక తెలిపారు.

డివైడర్‌పైకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

ప్రయాణికులు సురక్షితం

పెద్దాపురం (సామర్లకోట), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆదివారం రాత్రి పెద్దాపురం దర్గాసెంటర్ కూడలి ప్రాంతం వద్ద రాజమండ్రి నుంచి సామర్లకోట వైపునకు వస్తున్న ఆర్టీసీ బస్సు అదుపుతప్పి ట్రాఫిక్ డివైడర్ మీదికి దూసుకెళ్లింది. డ్రైవర్ సమయ స్ఫూర్తితో వ్యవహరించి బ్రేకులు వేసి అదుపుచేయడంతో ప్రమాదం తప్పింది. బస్సులో ఆ సమయంలో 22 మంది ప్రయాణికులు ఉన్నారు.



డివైడర్‌పైకి దూసుకెళ్లిన బస్సు

వైభవంగా మాఘమాస తిరునాళ్లు

సర్పవరంలో భావనారాయణస్వామి ఆలయానికి పోటెత్తిన వేలాది మంది భక్తులు



విశేషాలంకరణలో దర్శనమిచ్చిన శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మాఘమాస మహోత్సవాల్లో భాగంగా గత రెండు ఆదివారాలుగా నిర్వహిస్తోన్న శ్రీ రాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి తిరునాళ్లు అశేష భక్తుల నడుమ అత్యంత వైభవంగా సాగుతున్నాయి. కాకినాడ రూరల్ సర్పవరంలో వేంచేసిన శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామిని దర్శించుకునేందుకు రెండో ఆదివారం తెల్లవారుజాము నుంచే అనేక ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. కోనేరులో పుణ్యస్నానాలాచరించి భక్తిశ్రద్ధలతో ఆలయ ఈశాన్య దిక్కులో ఉన్న లక్ష్మీదేవి, ఆగ్నేయంలో ఉన్న ఆదిశేషు శ్రీభావనారాయణస్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఆవుపిడకలతో ఏర్పాటుచేసిన పొయ్యిలపై పాల పొంగులు తయారు చేసి, మొలకెత్తిన పెసలు, రేగుపండ్లు, చెరకు ముక్కలు, అరటి పండ్లను స్వామివారికి నైవేద్యంగా నివేదించారు. అనంతరం ఈ ప్రసాదాన్ని మహిళా భక్తులు చీరకొంగుల్లో ఒడిసి పట్టుకుని స్వీకరించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ చైర్మన్ పుల్ల శ్రీరాములు, దేవదాయ, ధర్మదాయశాఖ ఆధ్వర్యంలో దాతల వితరణలో భారీ అన్నదానం చేశారు. రెండో ఆదివారం స్వామివారిని సుమారు 50 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేశారు. సర్పవరం ఎస్‌హెచ్‌వో బి.పెద్దిరాజు ఆదేశాల మేరకు పోలీసులు బందోబస్తు నిర్వహించారు. స్థానిక హైస్కూల్‌కి చెందిన విద్యార్థులు సేవలు అందించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ ప్రాంగణంలో భక్తులు



మానవజన్మకు ముక్తి ద్వారానే సార్థకత

డాక్టర్ ఉమర్‌ఆలీషా

వార్షిక మహాసభల్లో పాల్గొన్న సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ



మహాసభలో మాట్లాడుతున్న సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ, చిత్రంలో డాక్టర్ ఉమర్‌ఆలీషా

పిఠాపురం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మానవజన్మకు ముక్తి ద్వారా సార్థకత చేకూరుతుందని విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా అన్నారు. పీఠం నూతన ఆశ్రమ ప్రాంగణంలో 3 రోజుల పాటు జరిగే పీఠం 97వ వార్షిక మహాసభలను పీఠాధిపతి ఉమర్‌ఆలీషా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణ చేస్తూ జీవాత్మ పరమాత్మగా పరిణామం చెందే అద్భుత అవకాశం మానవజన్మకే ఉందన్నారు. ధర్మ మార్గాన్ని అనుసరించడం ద్వారానే ముక్తిని పొందగలుగుతారని తెలిపారు. ముక్తిని పొందాలంటూ కోరికలు లేని స్థాయికి మానవుడు చేరుకోవాలని, అందుకోసం గురువును ఆశ్రయించి ఆధ్యాత్మిక, తాత్విక జ్ఞానాన్ని గ్రహించాలని చెప్పారు. మానవతా విలువల పరిరక్షణ కోసం పీఠం పాటుపడుతుందన్నారు.

మహాసభల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సమాజంలో అందరిని కలిపే తత్వం భారతీయ తత్వమన్నారు. నమ్మిన గురువుతో పరిపూర్ణమైన ప్రయాణం చేసే శిష్యుని జీవితం సార్థకమవుతుందని తెలిపారు. మహాసభల నిర్వహణ ద్వారా ఉమర్‌ఆలీషా మేదోమథనం చేపట్టి మనుషులందరిని కలిపే ప్రయత్నం చేస్తున్నారని ప్రశంసించారు. మహాసభల్లో కాకినాడ జిల్లా మూడవ అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవి, నర్తన రుషి డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్, డాక్టర్ హుస్సేన్‌షా, చింతపల్లి అమృతవల్లీ, పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, సెంట్రల్ కమిటీ సభ్యులు డాక్టర్ పింగళి ఆనందకుమార్, కె.స్వర్ణలత, డాక్టర్ ఎన్. రామగోపాలవర్మ, ఎన్ఆర్ఐ సభ్యులు శ్రీనివాస్, సూర్యకుమార్, ఉషారాణి, జేఎన్‌టీయూకే ప్రొఫెసర్లు డాక్టర్ సుమలత, డాక్టర్ హరనాథ్‌రాజు ప్రసంగించారు. పీఠం, ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు విశిష్టతలను తెలిపే బ్రోచర్లను ఆవిష్కరించారు.

లారీ యూనియన్ల వ్యవస్థ బలోపేతానికి సహకారం : ఎమ్మెల్యే



ఎమ్మెల్యే నానాజీని సత్కరిస్తున్న పలు యూనియన్ల సభ్యులు

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వేలాది మందికి ఉపాధి కల్పిస్తూ,జిల్లా ప్రగతిలో కీలకపాత్ర పోషిస్తున్న లారీ యూనియన్ల వ్యవస్థ బలోపేతానికి సంపూర్ణ సహకారం అందిస్తానని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. కాకినాడ జిల్లా లారీ యూనియన్ అధ్యక్షుడిగా ఎన్నికైన దుగ్గన నాగరాజు (బాబ్జీ) ఆధ్వర్యంలో పాటూ 19 యూనియన్ల ప్రతినిధులతో కలసి ఆదివారం రాత్రి గొడారిగుంటలో ఎమ్మెల్యే నివాసంలో నానాజీని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. నూతన అధ్యక్షుడు దుగ్గన బాబ్జీ, ఇతర యూనియన్ల సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. రాజకీయాలకతీతంగా లారీ యూనియను ఉండాలని, గతంలో వైసీపీ నాయకులు ప్రోద్బలంతో దళారులు ప్రవేశించడంతో కంపెనీ యాజమాన్యం, లారీ యాజమానులు తీవ్రంగా నష్టపోయారని, దళారులు బాగుపడ్డారన్నారు. మోటారు రంగం బాగుంటేనే అన్ని రంగాలతో పాటూ అంతా బాగుంటామని, దీనిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. లారీ యాజమానులు, డ్రైవర్ల సంక్షేమం, అభివృద్ధి కోసం జిల్లాలో ఉన్న ఇతర ఎమ్మెల్యేలతో మాట్లాడి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను వారు సత్కరించారు. కార్యక్రమంలో యూనియన్ వైస్ ప్రెసిడెంట్ దుర్గారావు, గౌరవాధ్యక్షుడు డి.ఈశ్వరరావు, ఎన్.వెంకసుబ్బారెడ్డి, ఎన్.సత్యనారాయణ, సింగిరెడ్డి రవి,వి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

రాజశేఖర్‌ను గెలిపించండి

ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థిగా పోటీచేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్‌ని గెలిపించి అభివృద్ధికి పట్టం కట్టాలని ఎమ్మెల్యే పంతం నానాజీ, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు కోరారు. ఆదివారం కాకినాడ రూరల్ నేమాం, పండూరు, తిమ్మాపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల పరిశీలకులు సుధాకర్, ఎంపీటీసీ నందిపాటి అనంత లక్ష్మిత్రిమూర్తులు, కూటమి నాయకులు నులుకుర్తి వెంకటేశ్వరరావు, మాదారపు తాతాజీ, కర్రి వెంకట్రాజు, నందిపాటి రమణ, పోసిన రాము, దాసరి శివ, రాందేవు సీతయ్యదొర పాల్గొన్నారు.

'రుణాలిచ్చి ఆదుకోవాలి'



ఎమ్మెల్యేను కలిసిన సంఘం ప్రతినిధులు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సబ్సిడీ రుణాలిచ్చి ఆదుకోవాలని జిల్లా సౌండ్ సిస్టమ్ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆదివారం కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబును కోరారు. కొత్తగా ఏర్పడిన కాకినాడ జిల్లా సౌండ్ సిస్టమ్ ఓనర్స్ అండ్ హెల్పర్స్ సంక్షేమ సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే కొండబాబును కలిశారు. ఈ నెల 11న కాకినాడ రెవెన్యూ కాలనీలో జరుగనున్న సంఘం సర్వసభ సమావేశానికి గౌరవ అతిథిగా విచ్చేయాలని ఆహ్వానించారు. అనంతరం జిల్లా సంఘం ప్రతినిధులు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీని మర్యాద పూర్వకంగా కలిసి సంఘం సర్వసభ్య సమావేశానికి గౌరవ అతిథిగా హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నడికట్ల లోవరాజు, కార్యదర్శి కుక్కల గణిరాజు, ఉపాధ్యక్షుడు పెంకే మారయ్య, కోశాధికారి డింగ్ రాజు, సంయుక్త కార్యదర్శి ప్రసాద్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వేడి టీ పడి చిన్నారికి తీవ్రగాయాలు

జీజీహెచ్ (కాకినాడ), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఒంటి పై వేడి టీ పడిన ఘటనలో ఓ చిన్నారి తీవ్రగాయాల పాలైన సంఘటన ఆదివారం సాయంత్రం కాకినాడలో జరిగింది. స్థానిక లచ్చిరాజువారి వీధికి చెందిన ఎం.వినోద్ కుమార్‌కు 14 నెలలు వయస్సు కలిగిన యోషిత సాయి శ్రీ అనే కుమార్తె ఉంది. ఆ చంటి పాప ఆదివారం సాయంత్రం ఇంటిలో ఆడుకుంటున్న సమయంలో కుటుంబ సభ్యులు వేడిగా టీ సిద్ధం చేసి నేల పై ఓ గిన్నెలో భద్రపర్చారు. ఈ క్రమంలో చిన్నారి ఆడుకుంటూ వెళ్లి ఆ గిన్నెను తాకింది. వెంటనే ఆ గిన్నెలో ఉన్న టీ చంటి పాప పై పడడంతో చిన్నారి ఛాతీ భాగంలో పడి తీవ్రంగా కాలిన గాయాలయ్యాయి. వినోద్‌కుమార్ కుమార్తెను వెంటనే జీజీహెచ్‌కు తరలించగా సర్జరీ వైద్యులు బర్న్స్ వార్డులో ఉంచి ప్రత్యేక చికిత్సను అందజేస్తున్నారు. టూటౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సూర్యనమస్కారాల పోటీలు



పిఠాపురంలో సూర్యనమస్కారాలు చేస్తున్న విద్యార్థులు

పిఠాపురం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): పిఠాపురం అగ్రహారం పశువుల సంత సమీపంలో శ్రీపాదశ్రీవల్లభ అనఘా దత్త క్షేత్రం ఆవరణలో 12వ సూర్యనమస్కారాల (యోగా) ప్రదర్శన పోటీలు ఆదివారం ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, సేవాభారతి ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలకు నియోజకవర్గంలోని సుమారు 25 పాఠశాలలకు చెందిన 300మంది విద్యార్థులు హాజరయ్యారు. వక్తలు మాట్లాడుతూ సూర్యనమస్కారాలు ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం కలుగుతుందని, రుగ్మతలు దూరమవుతాయని తెలిపారు. విజేతలకు సేవాభారతి ప్రతినిధులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ గోదావరి జిల్లాల కార్యవాహ్ రామచంద్రరావు, సూర్యరాయ గ్రంథాలయ కార్యదర్శి కొండేపూడి శంకరరావు, పతంజలి యోగా సమితి ప్రతినిధి శ్రీనివాసరావు, సమాలోచన ఆంధ్ర ప్రాంత అధ్యక్షుడు వడ్డాది సుబ్బారావు, జగదీశ్వరరావు, రేపాక సుబ్బారావు, గట్టి అశోక్ పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ ప్రశంసాపత్రాలు అందించారు.

కాకినాడలో సూర్యనమస్కారాలు

కాకినాడ అర్బన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడా పాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం టెన్నిస్ మైదానంలో సామూహిక సూర్యనమస్కారాల కార్యక్రమం నిర్వహించారు. ఆదిగరు యాగపీఠం వ్యవస్థాకుడు సచ్చిదానందయోగిస్వామి సూర్యనమస్కారాల ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో బి.శ్రీనివాసకుమార్, వ్యాయామ ఉపాధ్యాయసంఘం జిల్లా అధ్యక్షుడు వి.రవిరాజు, యోగ విద్యాపీఠం రాష్ట్ర అధ్యక్షుడు చిట్టూరి చిట్టిబాబు, వీవీఎస్‌మూర్తి యోగ శిక్షకులు ఇందిరాదేవి, సత్యనారాయణరాజు పాల్గొన్నారు.



కాకినాడలో సూర్యనమస్కారాలు చేస్తున్న అధికారులు

బంగారు పాపను దర్శించుకున్న వర్మ



పొన్నాడలో బంగారుపాపను దర్శనం చేసుకున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

కొత్తపల్లి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): పొన్నాడలో వేంచేసి ఉన్న బషీర్ బీబీ (బంగారుపాప)ను ఆదివారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ దర్శనం చేసుకున్నారు. బంగారుపాప దర్గా ముజావర్ల మతాచారం ప్రకారం ఆశీర్వచనాలను వర్మకు అందించారు. అనంతరం బంగారుపాపకు గులాబీపువ్వులు, కరజ్జం ప్రసాదాన్ని అందజేశారు. దర్గా ప్రముఖులు వర్మను దుశ్శాలువాతో సత్కరించారు. పలువురు టీడీపీ ప్రముఖులు బంగారుపాప దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

విశిష్ట గుర్తింపు సంఖ్యతో రైతులకు ప్రయోజనం : ఏవో

కరప, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రైతుల కోసం ప్రభుత్వం ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్యను కేటాయిస్తుందని, దీని వల్ల ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని మండల వ్యవసాయాధికారి అప్పసాని వెంకటరాజేష్ తెలిపారు. ఈ గుర్తింపు సంఖ్యతో వ్యవసాయ సేవలు సులభతరం అవుతాయని, మరింత పారదర్శకత చేకూరుతుందన్నారు. భారత ప్రభుత్వ సమన్వయంతో రాష్ట్ర వ్యవసాయశాఖ చేపడుతున్న బృహత్తర కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ఆధార్ కార్డు అనుసంధానించిన ఫోన్ నెంబరు, భూమి రికార్డులు తీసుకుని సమీపంలోని రైతు సేవా కేంద్రానికి వెళ్లి ఈనెల 25వ తేదీలోగా నమోదు చేయించుకోవాలని సూచించారు.

నేడు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

సామర్లకోట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకుని సోమవారం సామర్లకోట మండలం, మున్సిపాల్టీ పరిధిలో గల అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు, అన్ని అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నందున ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు సహకరించాలని సామర్లకోట ఎంఈవోలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య ఆదివారం ఓ ప్రకటలో కోరారు. ఈ కార్యక్రమాల్లో వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొంటారని వారు తెలిపారు. ఈ నెల 10న హాజరు కాని విద్యార్థులకు, అంగన్‌వాడీ చిన్నారులకు తిరిగి ఈనెల 17న మాత్రలు అందజేస్తామన్నారు.

ప్రశాంతంగా హిందీ పరీక్షలు

గొల్లప్రోలు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత హిందీ ప్రచార సభ(మద్రాసు) ఆధ్వర్యంలో గొల్లప్రోలు పట్టణంలోని మాధురి విద్యాలయలో ఆదివారం హిందీ ప్రాథమిక, మాధ్యమిక పరీక్షలు నిర్వహించారు. ప్రాథమిక పరీక్షకు 305మంది విద్యార్థులకు గానూ 278మంది, మాధ్యమిక పరీక్షకు 179 మందికి 166మంది హాజరయ్యారు. పరీక్షలు జరుగుతున్న తీరుని మాధురి విద్యాసంస్థల అధినేత కడారి తమ్మయ్యనాయుడు, సీతాదేవిలు, హెచ్‌ఎం మమతలు పర్యవేక్షించారు.

ఎంపీకి సమస్యలు విన్నవించుకున్న పలు సంఘాల ప్రతినిధులు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడలోని క్యాంపు కార్యాలయంలో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబును ఆదివారం పలు సంఘాల ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిసి తమ సమస్యలు విన్నవించుకున్నారు. ఎస్సీ వర్గీకరణలో రెల్లి సామాజిక వర్గ రిజర్వేషన్ శాతం పెంచేలా, రెల్లి కార్పొరేషన్ తిరిగి ఏర్పాటు చేసేలా కృషి చేయాలని సంఘం ప్రతినిధులు కోరారు. అదే విధంగా రెల్లి మేధావుల సంఘం వార్షిక క్యాలెండర్, డైరీని ఎంపీ చేతులమీదుగా ఆవిష్కరించారు. జిల్లాలోని రిసోర్స్ పర్సన్‌లు (ఆర్పీలు), మహిళా సంఘాల సభ్యులు పలు సమస్యలను విన్నవించగా ప్రభుత్వంతో మాట్లాడి తగు న్యాయం జరిగేలా కృషి చేస్తానని ఎంపీ ప్రకటించారు. ఎంపీని కలిసిన వారిలో రెల్లి సామాజిక వర్గ నాయకులు, కార్యవర్గ ప్రతినిధులు, ఆర్పీ సంఘాల ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు ఉన్నారు.

‘ఉపాధి’ పనులు కల్పించాలని వినతి

రౌతులపూడి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులు కల్పించాలని ఎస్ఎస్ పట్నం గ్రామ కూలీలు కోరుతున్నారు. ఆదివారం వారు సర్పంచ్ సింగంపల్లి వరలక్ష్మిని ఆమె నివాసంలో కలిశారు. మూడు నెలలుగా ఉపాధి పనులు కల్పించలేదని, ఈ విషయాన్ని అధికారులకు తెలిపినప్పటికీ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూలి పనులు లేక అల్లాడుతున్నామని అధికారులు స్పందించాలని కోరారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

రేపు, ఎల్లుండి రాష్ట్రవ్యాప్త మన్యం బంద్

విజయవంతానికి గిరిజన సంఘాల పిలుపు... మద్దతు తెలిపిన సీపీఎం

చింతూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గిరిజన చట్టాలపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యానించిన తీరుని తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఎం మండల కార్యదర్శి పల్లపు వెంకట్ పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజన సంఘాలు ఈ నెల 11, 12 తేదీల్లో చేపట్టే రాష్ట్రవ్యాప్త మన్యం బంద్‌కు తాము సంపూర్ణ మద్దతు ఇవ్వడంతో పాటు భాగస్వాములవుతామన్నారు. నాయకులు సీసం సురేష్, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, మొట్టుం రాజయ్య, పొడియం లక్ష్మణ్, మల్లం సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

చింతూరులో జరిగిన ఆదివాసీ జేఏసీ సమావేశంలో కేంద్ర కమిటీ సభ్యుడు మడివి నెహ్రూ మాట్లాడుతూ అదివాసీ చట్టాలపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఈ నెల 11, 12 తేదీల్లో జరిగే మన్యం బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. జేఏసీ నాయకులు సీసం తమ్మయ్య, తిమ్మసాయి, సోడె బాలకృష్ణ, బొడ్డు బలరాం, తీగల రవి, కాక సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

దేవీపట్నం (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్త మన్యం బంద్‌కు సహకరించాలని గోకవరం ఆర్టీసీ అడిషనల్ డీఎం అప్పారావుకు ఆదివాసీ జేఏసీ నాయకుడు తెల్లం శేఖర్ వినతిపత్రం అందించారు. గోకవరం డిపో నుంచి బస్సులను ఏజెన్సీకి పంపరాదని కోరారు. ఆదివాసీ నాయకులు కారం రామన్నదొర, యలగాడ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కూనవరం (ఆంధ్రజ్యోతి): 1/70 చట్టంపై అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను నిరసిస్తూ తలపెట్టిన మన్యం బంద్‌ను జయప్రదం చేయాలని ఆదివాసీ అఖిలపక్షం నాయకుడు గుజ్జా మోహనరావు కోరారు. ఆదివారం జరిగిన సమావేశంలో పెంటయ్య, భద్రయ్య, తెల్లం తమ్మయ్య, మడెం బాబు, నాగమణి, లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక (ఆంధ్రజ్యోతి): ఈ నెల 11,12 తేదీల్లో తలపెట్టిన రాష్ట్రవ్యాప్త మన్యం బంద్‌ను జయప్రదం చేయాలని పలువురు కోరారు. ఆదివారం గుండాల కాలనీ గ్రామంలో ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో మన్యం బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు అర్జున్, ఐద్వా నాయకురాలు పొడియం రత్తమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు హుస్సేన్, డీవైఎఫ్ నాయకులు సుధాకర్, ప్రవీణ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే సమకూర్చిన ఆర్థిక సహాయాన్ని గిరిజన యువతికి అందిస్తున్న కూటమి నాయకులు

గిరిజన యువతి వైద్య ఖర్చులకు రూ.50వేలు సహాయం

వై.రామవరం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.యర్రగొండ గ్రామానికి చెందిన గిరిజన యువతి పల్లాల శ్రీలత లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. ఈ విషయం తెలుసుకున్న రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి-భాస్కర్ దంపతులు ఆదివారం కూటమి నాయకుడు గొర్లె శ్రీకాంత్, ఇతర నేతల ద్వారా రూ.50వేలు ఆర్థిక సహాయం అందచేయించారు. శ్రీలతను స్వగ్రామం నుంచి హైదరాబాద్ ఆసుపత్రి వరకు తీసుకువెళ్లేందుకు సొంత అంబులెన్స్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు ఆర్.పుష్పరాజు, టీడీపీ సీనియర్ నాయకులు రెడ్డి సత్యనారాయణ, వెంకటరెడ్డి, కుప్పా శ్రీను, సత్యనారాయణ, గుడ్ల ప్రసాద్, గుడ్ల బాబు, కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.


నాగేశ్వరరావు పార్థివ దేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి దంపతులు

టీడీపీ సీనియర్ నాయకుడు నాగేశ్వరరావుకు నివాళి

రాజవొమ్మంగి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గడువోకుర్తి మాజీ సర్పంచ్, టీడీపీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడిగా సేవలందించిన సీనియర్ నాయకుడు చలుమూర్తి నాగేశ్వరరావు అకాల మృతి పార్టీకి తీరని లోటని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. శనివారం సాయంత్రం రాజమహేంద్రవరంలో అకస్మికంగా మృతి చెందిన నాగేశ్వరరావు పార్థివదేహాన్ని అంబులెన్స్‌లో గొబ్బులమడుగు తీసుకురాగా ఎమ్మెల్యే శిరీషదేవి, విజయభాస్కర్ నాగేశ్వరరావు దంపతులు సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పంచాయతీ అభివృద్ధికి నిరంతరం తపించిన నాగేశ్వరరావు సేవలు మరవరానివన్నారు. నాగేశ్వరరావు కుటుంబీకులను కూటమి నాయకులు, కార్యకర్తలు పరామర్శించారు.

‘తునికాకు సేకరణకు టెండర్ల ప్రక్రియ చేపట్టాలి’

ఎటపాక, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వేసవిలో గిరిజనులకు ఉపాధి కల్పించే తునికాకు సేకరణకు టెండర్ల ప్రక్రియ చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ కోరారు. ఆదివారం గుండాల కాలనీలో సొందే రామారావు అధ్యక్షతన జరిగిన పార్టీ మండల శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2012 నుంచీ పెండింగ్‌లో ఉన్న తునికాకు బోనస్ నిధులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది తునికాకు కట్ట ధరను పెంచాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మర్లపాటి నాగేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యుడు ఐ.వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి కాక అర్జున్‌దొర, మండల కమిటీ సభ్యులు పులుసు బాలకృష్ణ, హరి, రత్తమ్మ, హుస్సేన్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్


క్షతగాత్రులను అంబులెన్సులో ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

నలుగురికి తీవ్ర గాయాలు

అడ్డతీగల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): అడ్డతీగల శివారులోని టేకు ప్లాంటేషన్ సమీపంలో ఆదివారం రాత్రి ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడగా 108 అంబులెన్సులో అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి ఉన్నత వైద్యం కోసం మైదాన ప్రాంతానికి తరలించినట్టు వైద్యాధికారులు చెప్పారు. కాగా క్షతగాత్రులు వివరాలు చెప్పలేని స్థితిలో ఉన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

ఏవీ నగరంలో ముగిసిన వెంకన్న బ్రహ్మోత్సవాలు

తొండంగి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏవీ నగరంలో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం చక్రస్నానంతో వైభవంగా ముగిసాయి. స్వామి, ఉభయ దేవేరుల ఉత్సవమూర్తులతో పాటు చక్రత్తాళ్వారును ఆలయం నుంచి బాజాభజంత్రీలు, మంగళ వాయిద్యాల నడుమ కోనేటి వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అక్కడ అర్చకులు విశేష అర్చనలు నిర్వహించి తులసిమాలలు సమర్పించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు, సుదర్శన చక్రానికి వేదమంత్రోచ్చారణల నడుమ పంచామృతాభిషేకాలు జరిపి హారతులు సమర్పించారు. కోనేటి జలాలను వేద మంత్రాలతో శుద్ధీకరించి భక్తుల గోవిందనామస్మరణ మధ్య ఉత్సవమూర్తులతో పాటు సుదర్శన చక్రానికి కోనేటిలో పవిత్ర స్నానమాచరింప చేశారు. అనంతరం భక్తులు స్నానాలాచరించారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు దంపతులతో అర్చకులు వెంకన్న, మిత్రా పూజలు చేయించారు. యనమల నాగేశ్వరరావు దంపతులు, అరిగెల నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.


కోనేరు వద్ద పూజలు చేస్తున్న యనమల దంపతులు


రథోత్సవంలో పాల్గొన్న ఈవో దంపతులు, భక్తులు

సత్యదేవునికి వేడుకగా రథోత్సవం

అన్నవరం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి ఆదివారం వారాంతపు ఆర్జిత సేవ అయిన రథోత్సవం వేడుకగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి, అమ్మవార్లకు పుష్పాలంకరణ చేసిన రథంపై ఆశీనులు గావించారు. పండితుల మంత్రోచ్చారణలు, భక్తుల గోవిందనామస్మరణ నడుమ మూడుసార్లు తూర్పు రాజ గోపురం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. అనంతరం హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఈవో వీర్ల సుబ్బారావు దంపతులు, సూపరింటెండెంట్ ఐవీ రామారావు తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థికి బహుమతి అందజేస్తున్న విజయ్‌ప్రకాష్

‘విద్యార్థుల ప్రగతి వారి ఉజ్వల భవిష్యత్తుకు నాంది’

తుని రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ప్రగతి వారి ఉజ్వల భవిష్యత్తుకు నాంది అని శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్ పేర్కొన్నారు. జాతీయ, రాష్ట్ర, జిల్లా, పట్టణ స్థాయిల్లో పాఠశాల నుంచి కళాశాల వరకు వివిధ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సుమారు 1,050 మంది విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. నూటికి నూరు శాతం హాజరు కనబరిచిన శ్రీప్రకాష్ విద్యార్థులకు వారి తల్లిదండ్రులతో పాటు విజయ్‌ప్రకాష్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులకు కేవలం చదువులోనే కాకుండా ఇతర రంగాల్లో కూడా అవకాశం కల్పించాలని, వారు తలచుకుంటే సాధించలేనిది ఏమీ లేదన్నారు.

కార్యక్రమంలో శ్రీప్రకాష్ విద్యా సంస్థలకు చెందిన వివిధ విభాగాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆంధ్ర భద్రాద్రి క్షేత్రానికి రూ.లక్ష విరాళం

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో నూతనంగా నిర్మిస్తున్న తులాగిరి శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానం, ఆంధ్ర భద్రాద్రి క్షేత్రానికి విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు రూ.లక్ష విరాళం ప్రకటించారు. ఆదివారం ఆయన తులాగిరి ఆలయాన్ని సందర్శించి కొబ్బరికాయ కొట్టి పూజలు చేశారు. వ్యవస్థాపక అధ్యక్షుడు గళ్ళా సుబ్బారావు, అనంతపల్లి శ్రీను, పుష్పారెడ్డి, గోగుల వెంకటేశ్వరరావు, రెడ్నం రాజా, వెలుగుల హరేరాం, వూటా వీరబాబు, జువ్వల చినబాబు, అద్దేపల్లి రాజా, సానా నూకరాజునాయుడు, చింతాకుల రామకృష్ణ, కడారి నాగేశ్వరరావు, రామకుర్తి సూర్యనారాయణ, వూటా భాస్కరరావు, తేజోమూర్తుల సుబ్రహ్మణ్యం, ఉషారాణి, భక్తులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఏపీ ఫార్మర్ రిజిస్ట్రీలో పేర్లు నమోదు చేసుకోవాలి

కిర్లంపూడి ఏవో జోకా అమృత



కిర్లంపూడి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాల లబ్ధి పొందాలంటే రైతులు ఏపీ ఫార్మర్ రిజిస్ట్రీలో పేరు నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారిణి జోకా అమృత తెలిపారు. ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ పుస్తకం, పట్టాదారు పాస్ పుస్తకం నకళ్లతో పాటు మొబైల్ నెంబర్‌ను రైతు సేవా కేంద్రానికి తీసుకెళ్లాలన్నారు. మరిన్ని వివరాలకు వ్యవసాయ సహాయకులను సంప్రదించాలన్నారు.


ఏలేశ్వరంలో మిఠాయిలు తినిపించుకుంటున్న బీజేపీ శ్రేణులు

బీజేపీ నాయకుల సంబరాలు

ఏలేశ్వరం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నాయకత్వంపై ప్రజల్లో విశ్వాసం మరింత బలపడిందని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గట్టిం వెంకట రమణ అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంపై ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం స్థానిక బాలాజీచౌక్ సెంటర్లో ఆదివారం మిఠాయిలు పంచి, బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. నాయకులు రెడ్డి లోవరాజు, గొన్నావత్తుల రాజబాబు, గట్టిం సీతారాం, మార్కొండ సత్యనారాయణ, కూసే నాని, విపత్తు శ్రీను, ప్రకాష్, గునుపూడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా లోవరాజు

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా బర్ల లోవరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా లోవరాజును, కార్యదర్శిగా గల్లా కృష్ణమోహన్‌ను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని సీనియర్ పాత్రికేయులు సోమేశ్వరరావు, బాబూరావు, జానకి ప్రభాకర్, ప్రగడ రామకృష్ణ, సిగిరెడ్డి రమేష్, రెడ్నం మురళి, శివ అభినందించారు.

800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దిపాలెంలో మారుమూల ప్రదేశాల్లో రహస్యంగా నిర్వహిస్తున్న నాటుసారా బట్టీలపై ఎక్సైజ్ సీఐ శివప్రసాద్, ఎస్ఐ వంశీరామ్, సిబ్బంది ఆదివారం దాడులు నిర్వహించారు. 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.

ఆర్థిక సహాయం

తుని రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఎస్.సూరవరంలో జరిగిన అగ్ని ప్రమాదంలో వడ్లమూరి అప్పలరాజు సర్వం కోల్పోయింది. ఆమెకు టీడీపీ సీనియర్ నేత చింతమనేడి నాగ సోమరాజు (అబ్బాయి) రూ.10వేలు నగదుతో పాటు నిత్యావసరాలు అందజేశారు.

‘పీవీటీజీలు త్వరగా సర్వే చేయించుకోవాలి’

వై.రామవరం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో గృహ నిర్మాణ లబ్ధిదారులైన పీవీటీజీలు (కొండరెడ్లు) సర్వే యాప్ ద్వారా కుల ధ్రువీకరణ, ఆధార్, జాబ్‌కార్డు, అకౌంట్ నెంబర్లను సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ద్వారా ఆన్‌లైన్‌లో పొందుపరుచుకోవాలని గృహ నిర్మాణ శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ నాగార్జున కోరారు. ఈ యాప్ వారం పాటు ఓపెన్‌లో ఉంటుందని, త్వరగా నమోదు చేయించుకోవాలన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి రాజశేఖర్‌కు మద్దతుగా ప్రచారం

కోటనందూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతుగా టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు గాడి రాజుబాబు ఆధ్వర్యంలో రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ వజ్రా బాబూరావు, కాకినాడ మాజీ మేయర్ సుంకర పావని ఆదివారం కోటనందూరులో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. టీడీపీ సీనియర్ నాయకులు యనమల రాజేష్, చింతంనీడి అబ్బాయి, మాజీ ఎంపీపీ డి.చిరంజీవిరాజు, అంకంరెడ్డి రమేష్, వెలగా వెంకటకృష్ణారావు, పోతల సూరిబాబు, చింతకాయల రవికుమార్, తాండవ వైస్ చైర్మన్ మేరపురెడ్డి జోగిబాబు, యర్ర చిన సత్యనారాయణ, డి.శివబాబు రాజు, బోడపాటి సత్యనారాయణ, లగుడు సత్యనారాయణమూర్తి, పెనుముచ్చు నాగేశ్వరరావు, సామినీడి కృష్ణార్జున, అంకంరెడ్డి బుల్లిబాబు, అల్లూరి లోవరాజు, రుత్తల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏలేశ్వరం (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రత్యేక పరిశీలకుడు గొంప గోపాలకృష్ణ, నియోజకవర్గ పరిశీలకుడు మెట్ల రమణబాబు కోరారు. ఆదివారం స్థానిక ఎస్ కన్వెన్షన్ హాలులో ఎమ్మెల్సీ ఎన్నికలపై సమావేశం నిర్వహించారు. టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు మూది నారాయణస్వామి, కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి, జ్యోతుల పెదబాబు, నూకతాటి ఈశ్వరుడు, వాగు రాజేష్, వైబోగుల సుబ్బారావు, మైరాల కనకారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎటపాక (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతుగా కూటమి నాయకులు బొజ్జిగుప్ప, చెన్నంపేట గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. రంపచోడవరం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ బాచినేని శ్రీకాంత్, తెలుగు యువత జిల్లా నాయకులు పాటి సంపత్, అలవాల వెంకట్రావు, మాజీ జడ్పీటీసీ గొడేటి రవికుమార్, బీజేపీ నాయకుడు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

‘వెట్టిచాకిరీని నిర్మూలించాలి’

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వెట్టిచాకిరీ బానిసత్వానికి చిహ్నమని, దాని నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రత్తిపాడు కోర్టు ప్యానల్ అడ్వకేట్ బుగతా శివ కోరారు. ఆదివారం మండలంలోని పెద శంకర్లపూడి పంచాయతీ కార్యాలయం వద్ద మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వెట్టిచాకిరీ నిర్మూలనపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామ పెద్దలు సూర్నీడి సురేష్, జువ్విన తిరుపతి రావు, దళే నాగేశ్వరరావు, కందుల పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

వాతంగిలో పోలీసుల పల్లె నిద్ర

రాజవొమ్మంగి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లోతట్టు గిరిజన ప్రాంతమైన వాతంగిలో పోలీసులు శనివారం రాత్రి పల్లె నిద్ర చేశారు. జడ్డంగి ఎస్ఐ చిన్నబాబు గ్రామస్తులతో సమావేశమై సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చేయడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. పిల్లలను బాగా చదివించాలన్నారు. గంజాయి పండించినా, పట్టుబడినా చర్యలు తప్పవన్నారు. యువతకు వాలీబాల్ కిట్లు అందించారు.


యువతకు వాలీబాల్ కిట్ అందజేస్తున్న ఎస్ఐ

పాపికొండలుకు పర్యాటకుల తాకిడి

దేవీపట్నం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పాపికొండలు విహార యాత్రకు ఆదివారం ఏడు బోట్లు వెళ్లాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి సుమారు 430 మంది పర్యాటకులు వెళ్లారు. మాతృశ్రీ గండిపోశమ్మ బోటు పాయింటు నుంచి గోదావరి ముంపు పరివాహక ప్రాంతాలైన పూడిపల్లి, దేవీపట్నం, కొండమొదలు, గొందూరు, మంటూరు గ్రామాల మీదుగా పేరంటాలపల్లి వెళ్లి సాయంత్రం ఐదు గంటలకు బోటు పాయింట్‌కు చేరుకున్నారు.

మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వేకువజామునే గోదావరిలో పుణ్యస్నానాలాచరించి అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

వారపు సంతలో పోలీసుల గస్తీ



మోతుగూడెం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మోతుగూడెంలో ఆదివారం జరిగిన సంతలో పోలీసులు ఉదయం నుంచి సాయంత్రం వరకు గస్తీ నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ చెక్ పోస్టు వద్ద సీఆర్పీఎఫ్ పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. మండల కేంద్రం నుంచి మారుమూల గ్రామాలకు వెళ్లి, వచ్చే వాహనాలను, ప్రయాణికులను, లగేజీని క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

‘లోవ’లో భక్తుల కోలాహలం

తుని రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లోవ దేవస్థానానికి ఆదివారం ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు పోటెత్తారు. అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆదివారం వివిధ విభాగాల ద్వారా రూ.3.70 లక్షల ఆదాయం లభించిందని ఆలయ సహాయ కమిషనరు, ఈవో పి. విశ్వనాధరాజు తెలిపారు.



పద్మనాభ నగర్‌లో రావులమ్మ తల్లి జాతర

జగ్గంపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక పద్మనాభ నగర్‌లో రావులమ్మ తల్లి జాతరను యువకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. శక్తి వేషాలు, తీన్మార్ డప్పులు, దశావతారం వేషధారణ ఆకట్టుకున్నాయి. ఇళ్లల్లో నైవేద్యాలు పెట్టుకున్నారు. బంధువులను, ఆడపడుచులను పిలిచి కొత్త దుస్తులు ఇచ్చి విందు భోజనం పెట్టారు.